## క్లుప్తంగా

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వరలక్ష్మి తదితరులు

**కాకినాడ రూరల్:** రమణయ్యపేట కొత్తూరులో ఎన్నారై ఉషారాణి ఆర్థిక సహకారంతో పేదలకు దుప్పట్లను నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ సేవతోనే భగవంతుని మెప్పు లభిస్తుందని, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వృద్ధులకు సేవ చేయాలనే దృక్పథంతో ఎన్నారై ఉషారాణి దుప్పట్లు అందించారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, పార్థసారథి, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ



వేములవాడలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

**కరప:** వేమువాడలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించారు. ఆపరేషన్ చేయించుకుని, విశ్రాంతి తీసుకుంటున్న దూడల శ్రీనును ఎమ్మెల్యే పలకరించారు. మీసాల నాగేశ్వరరావు ఇటీవల మరణించగా, ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మీసాల సూరిబాబును ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మాజీ ఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉద్దండ సూర్యనారాయణ, నాయకులు పెంకే సత్తిబాబు, బండే తాతాజీ, కమిడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### సామాజిక కార్యకర్తలకు సత్కారం



విశాఖపట్నంలో రాజును సత్కరిస్తున్న తాసుబెల్లి ఫౌండేషన్ నిర్వాహకులు

**కరప:** ఆపదలో ఉన్నవారికి ఆదుకుంటున్న సామాజిక కార్యకర్తలను విశాఖపట్నం అక్కయ్యపాలెంలోని తాసుబెల్లి ఫౌండేషన్ సోమవారం ఘనంగా సత్కరించింది. భారత సేవారత్న అవార్డును ప్రదానం చేసింది. ఆ సంస్థ నెలకొల్పి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కరప మండలం గురజనాపల్లిలోని మానవత్వం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు జొన్న లగడ్డ రాజును, 88 సార్లు రక్తదానం చేసిన కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును నిర్వాహకులు సత్కరించారు.

### భోగి గణపతికి పూజలు



భోగి గణపతి పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు

**బోట్‌క్లబ్:** సంకష్టహర చతుర్థి సందర్భంగా కాకినాడ భోగి గణపతి పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి సహస్ర స్తోత్ర పారాయణ జరిగింది. ఉపవాసకులు భారీగా ఉండ్రాళ్లు నివేదించారు. భక్తులకు పసుపు కుంకుమలతో చతుర్థి అల్పాహారం అందజేశారు. పీఠం వ్యవస్థాపక ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ మాఘ మాసం నుంచి 24 నెలల పాటు ప్రతి నెలా సంకష్ట హర చతుర్థి రోజున సుప్రభాత వేళలో పల్లకీసేవ, సంధ్య వేళలో కోటి వత్తులతో హారతి నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

**కాకినాడ సిటీ:** షాపింగ్ మాల్స్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను సీఐటీయూ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు జి.బేబీరాణి మాట్లాడుతూ కాకినాడలోని షాపింగ్ మాల్స్‌లో పెద్ద సంఖ్యలో కార్మికులు, ముఖ్యంగా మహిళలు పని చేస్తున్నారన్నారు. కేరళ, తమిళనాడు తరహాలో మాల్స్‌లో పనిచేసే కార్మికులకు స్టూల్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా మహిళలకు వారాంతపు సెలవు ఆదివారం అమలు చేసి పిల్లలతో గడిపే అవకాశం ఇవ్వాలన్నారు. చట్టప్రకారం బోనస్ అమలు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. తమ వినతిపై కలెక్టర్ కృతికా శుక్లా కార్మికశాఖ అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. సీఐటీయూ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, మలక వెంకటరమణ, పలివెల వీరబాబు తదితరులు ఉన్నారు.

# అతివలకు అగ్రతాంబూలం

- పొదుపు సంఘాల ప్రగతికి వైఎస్సార్ ఆసరా
- పక్కాగా అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- నగరంలో 38 వేల మందికి రూ.102 కోట్ల లబ్ధి



కాకినాడలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆసరా లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు

**బోట్‌క్లబ్:** ఇంటికి ఇల్లాలే వెలుగు.. అలాంటి మహిళామణులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోంది. అక్కచెల్లెమ్మల జీవితాలకు వెలుగులు తెచ్చింది.. ఎన్నికల హామీల్లో భాగంగా డ్వాక్రా రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేశారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసి మాటను నిలబెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ ఆసరా, స్త్రీనిధి, వంటి పథకాలతో మహిళలు సమాజంలో ఉన్నతంగా జీవిస్తున్నారు. కాకినాడలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ. 102 కోట్లను మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 3,800 గ్రూపులకు చెందిన 38 వేల మంది సభ్యులు లబ్ధి పొందారు.

**చంద్రబాబు హయాంలో దగా**

పొదుపు మహిళా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని నెరవేర్చకుండా మొండిచేయి చూపారు. పొదుపు మహిళలు చంద్రబాబు మాటలను నమ్మి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో డిఫాల్టర్లుగా మిగిలారు. దీంతో పొదుపు సంఘాల మహిళలకు టీడీపీ ప్రభుత్వ హయాంలో బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. చంద్రబాబు చేసిన మోసానికి అక్కచెల్లెమ్మలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొదుపు సంఘాలకు జీవం పోసింది. మళ్లీ ఆర్థికంగా నిలదొక్కుకునేలా బాటలు చేసింది. సకాలంలో రుణాలు చెల్లించిన సంఘాలకు సున్నా వడ్డీ పథకం అమలు చేస్తూ భరోసా ఇచ్చింది.

**జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంతే**

రాష్ట్ర ప్రజలందరి అభ్యున్నతితోపాటు మహిళలు ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ప్రజా సంకల్పయాత్ర సమయంలో 2019 ఏప్రిల్ నాటికి పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని అప్పటిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు మహిళలకు రుణ మాఫీని అమలు చేసి భరోసా ఇచ్చారు. ఒక వైపు సున్నా వడ్డీ రుణాలు, మరోవైపు రుణమాఫీ అమలు చేసి వారి సంక్షేమానికి తోడ్పడ్డారు. 2014 సార్వత్రిక ఎన్నికలకు రెండు నెలలు ముందుగానే ఈ రుణ మాఫీ హామీని పక్కాగా అమలు చేసిన సీఎంగా అందరి ఆదరాభిమానాలు పొందుతున్నారు.

**జీవితాలకు వెలుగు**



నేను పొదుపు సంఘ సభ్యురాలిని. సీఎం జగనన్న అందించిన వైఎస్సార్ ఆసరా నగదుతో మా జీవితాలకు వెలుగు వచ్చింది. నాలుగు విడతల్లో రూ.50 వేలు నా బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాకు చేసిన మేలును ఎప్పటికీ మరువలేను. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనకు మద్దతిస్తాం.

–డి.దుర్గాదేవి, రాజేంద్రనగర్, కాకినాడ

**ఇచ్చిన మాట ప్రకారం**



గతంలో చంద్రబాబు రుణ మాఫీ చేస్తానని మాట ఇచ్చారు కానీ అమలు చేయలేదు. దీంతో వడ్డీలు కట్టలేక చాలా ఇబ్బందులు పడ్డాం. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణ మాఫీ చేశారు. నాలుగు విడతల్లో రూ. 42 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది.

–పద్మావతి, విద్యుత్‌నగర్, కాకినాడ

### నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



అరట్లకట్టలో ప్రారంభించనున్న వంతెన ఇదే..

**కరప:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి తెలిపారు. అరట్లకట్టలో కొవ్వూరు కెనాల్‌పై రూ.1.10 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారన్నారు. తర్వాత గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కన్నబాబు పర్యటించి సుమారు రూ.3 కోట్లతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు తదితర వాటికి ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. దీనికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు తరలి రావాలని కోరారు.

### అధునాతన కంప్యూటర్ల ప్రారంభం



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సుబ్బారావు, ఎంపీడీఓ అప్పారావు

**కరప:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా కొనుగోలు చేసిన నాలుగు అధునాతన కంప్యూటర్లను ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అందుకు అనుగుణంగా మండల పరిషత్ సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ పనుల నిర్వహణలో జాప్యం లేకుండా ఉండేందుకు ఒక్కొక్కటి రూ.67 వేల చొప్పున నాలుగు అధునాతన కంప్యూటర్లు కొనుగోలు చేశామన్నారు. ఏఓ గుత్తుల భీమశంకరరావు, సిబ్బంది వీవీఎన్ వీరేష్, టి.సురేష్, జీవీ చినరాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ‘బాబు’ మోసం నుంచి పుట్టిన పథకం ‘ఆసరా’

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

**కాకినాడ:** దేశ చరిత్రలో ఒక రాజకీయ నాయకుడి మోసం నుంచి ప్రజలను ఆదుకునేందుకు పుట్టిన పథకం వైఎస్సార్ ఆసరా అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఎక్కడైనా ప్రజల ఇబ్బందులను, కష్టాలను, సమస్యలను చూసి పథకాలను ప్రవేశపెడతారని, ఇక్కడ మాత్రం చంద్రబాబు లాంటి ఓ మోసకారి కారణంగా దగాపడిన మహిళలను ఆదుకోవడానికి సీఎం జగన్ ఈ పథకాన్ని తీసుకొచ్చారన్నారు. స్థానిక జగన్నాథపురం రాజీవ్ గృహకల్ప, ముస్లిం కమ్యూనిటీ హాలు, ఇతర ప్రాంతాల్లో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. సీఎం జగన్ చిత్రపటానికి డ్వాక్రా మహిళలు, ఆర్పీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ 2014లో డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో ఎంతో మంది మహిళలు బ్యాంకుల్లో పరపతి కోల్పోయి కొత్త రుణాలు మంజూరు కాక, అధిక ఫెనాల్టీలు కట్టి అప్పుల్లో కూరుకుపోయారన్నారు. మరెంతో మంది ప్రాణాలు కూడా కోల్పోయారన్నారు. ఇటువంటి వాస్తవ పరిస్థితిని గుర్తించిన సీఎం జగన్ ఎన్నికలకు ముందు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు విడతలుగా డ్వాక్రా రుణాలను రద్దు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ఒక్క కాకినాడ సిటీ నియోజకవర్గంలో రూ. 102 కోట్ల రుణాలను రద్దు చేశారన్నారు. ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే సీఎం ప్రధాన లక్ష్యమన్నారు. అందుకే ప్రతి పథకంలోనూ వారి భాగస్వాములను చూస్తూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన అన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, చేయూత, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చిన లబ్ధిని సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళా ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ‘స్పందన’

కమిషనర్ నాగ నరసింహారావు




సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నాగ నరసింహారావు

**కాకినాడ:** ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు జగనన్నకు చెబుదాంలో భాగంగా డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. అనంతరం ‘స్పందన’లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌లో 10 మంది, స్పందనలో ఏడుగురు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యాక అందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రతి రోజూ టోల్‌ఫ్రీ ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కమిషనర్ చెప్పారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఫోన్ చేయవచ్చన్నారు. ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాసు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, ఏఓ శిరీష, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అరకొర జ్ఞానంతోనే కొండబాబు ఆరోపణలు

- మండిపడిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- వాస్తవాలు తెలుసుకోవాలని హితవు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

**కాకినాడ:** విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రైవేట్ భూమిని సేకరించే అంశంలో రూ.కోట్లలో కార్పొరేషన్ ఖజానాకు నష్టం కలిగిందంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అరకొర జ్ఞానంతో మాట్లాడుతున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మండిపడ్డారు. సోమవారం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో సుమారు 10 నెలల కిందట సమస్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో జరిగిన చర్చల నేపథ్యంలో సబ్‌స్టేషన్ సమస్య ప్రస్తావనకు వచ్చిందన్నారు. ఆ రోజు తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రభుత్వ భూమి అందుబాటులో లేనందున ఒకప్పుడు టీడీపీ ఇచ్చిన జీఓ ఆధారంగానే టీడీఆర్ బాండ్లు జారీ చేసి ఓ ప్రైవేట్ సంస్థ నుంచి భూమి సేకరించామని స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని పక్కన పెట్టి నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్ బాండ్ల ద్వారా కోట్లాది రూపాయల అక్రమాలు జరిగాయంటూ ఆయన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిజంగా బాండ్లు జారీ చేయడం తప్పు అయితే ముందుగా ఆ జీఓ ఇచ్చిన టీడీపీని, చంద్రబాబును తప్పుపట్టాలని ద్వారంపూడి అన్నారు. పట్టణ ప్రాంతంలో దాదాపు నాలుగున్న ఎకరాల స్థలాన్ని టీడీఆర్ ద్వారా సేకరించడంలో శ్రమించిన కలెక్టర్, కమిషనర్, ఇతర అధికారుల ప్రతిభను అభినందించాల్సిందిపోయి ఇలా ఆరోపణలు చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. త్వరలోనే ఆ అధికారులను సత్కరిస్తానన్నారు. టీడీఆర్ బాండ్ల జారీ వల్ల కార్పొరేషన్ ఖజానాకు ఒక్క రూపాయి కూడా నష్టం లేదన్నారు. ఏటిమొగలోని ప్రభుత్వ స్థలానికి ఫోర్జరీ డాక్యుమెంట్లతో దొంగ పట్టాలు సృష్టించిన కొండబాబు తమపై నిందలు వేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కొండబాబు అవినీతి చిట్టా, అక్రమాలను బయట పెట్టాలనుకుంటే ఎంత సమయమైనా చాలదన్నారు. రానున్న ఎన్నికల్లో తన విజయం ఖాయమన్నారు. కనీసం టిక్కెట్ వస్తుందో కూడా తెలియని అయోమయంలో ఉన్న కొండబాబు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయంగా ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. గత ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ఆయన హడావుడిగా శంకుస్థాపనలు చేసి వదిలివేసిన అభివృద్ధి పనులను తాను ఆచరణలో చేసి వినియోగంలోకి తెచ్చానన్నారు. ఆయనలా ప్రచార ఆర్భాటం కోసం గొప్పలు చెప్పుకోనన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే హితవు పలికారు.

# కలెక్టర్ హామీతో దీక్ష విరమణ



రమణరాజుతో దీక్షను విరమింపజేస్తున్న ఆర్డీఓ, డీఎస్పీలు

**కాకినాడ సిటీ:** ధర్నా స్థలి అసౌకర్యాలపై సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు నాలుగు రోజులుగా చేస్తున్న నిరాహార దీక్ష కలెక్టర్ కృతికా శుక్లా హామీతో సోమవారం విరమించారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, అఖిలపక్ష బృందం స్థానిక కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను కలసి ధర్నాస్థలి దూరం చేసి రెండేళ్లు అయ్యిందని, అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల నుంచి నూరు శాతం అభ్యంతరాలు ఉన్నాయని వివరించారు. ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ధర్నా స్థలి అభ్యంతరాలు స్వీకరించి నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆర్డీఓ ఇట్ల కిశోర్, డీఎస్పీ మురళీధర్‌రెడ్డిలకు తక్షణ ఆదేశాలిచ్చారు. వెంటనే వీరు దీక్ష స్థలికి చేరుకుని రమణరాజుతో మాట్లాడి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి అందరి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. రమణరాజు మాట్లాడుతూ కలెక్టర్ కృతికా శుక్లాకు ధన్యవాదాలు తెలిపారు.

# గ్రామాభివృద్ధి ప్రణాళికపై దృష్టి సారించాలి



కరపలో కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ అన్నామణి

**కరప:** గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి, దానికి అనుగుణంగా గ్రామాభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2024–25 రూపొందించాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.అన్నామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమీక్ష జరిపి, సూచనలు చేశారు. పంచాయతీలకు సంబంధించి ఇంటి పన్నులు, పన్నేతరాల వసూళ్లు ఫిబ్రవరి నెలాఖరుకు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి, పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు జరపాలన్నారు. సామిత్వ, పీఎం విశ్వకర్మ పథకం, ఏపీ పీఆర్ పోర్టల్, డిజిటల్ పేమెంట్స్, విద్యుత్ మీటర్ల సర్వే, పారిశుధ్య పనుల నిర్వహణపై డీఎల్‌పీఓ గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. అనంతరం కరపలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించి, కంపోస్ట్ ఎరువు తయారీపై సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కాకినాడ:** విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా మంగళవారం డైరీఫారం సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అంతరాయం కలుగుతుందన్నారు. డి–7 సెక్షన్ పరిధిలో దుమ్ములపేట, రాజీవ్ గృహకల్ప, తారకరామానగర్, సత్యనగర్, డి–2 సెక్షన్‌లో పోర్టు, ఇండస్ట్రియల్ పోర్టు ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని డీఈ కోరారు.

### గగారిన్‌కు సముచిత స్థానం



**కాకినాడ రూరల్:** వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్య అనుచరుడు జంగా గగారిన్‌కు ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ద్వారా సముచిత స్థానం లభించింది. ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా నియమిస్తూ సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ (ఎఫ్ఏసీ) జి.జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడిగా పార్టీ కోసం శ్రమిస్తున్న గగారిన్‌కు పదవి రావడం పట్ల నియోజవర్గంలో దళితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సినీ దర్శకుడు కురసాల కల్యాణ్‌కృష్ణ, పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# స్నేహమంటే ఇదేరా..

- బాల్య మిత్రునికి మోటారు సైకిల్ సమకూర్చిన పూర్వ విద్యార్థులు



వెంకటరమణకు మూడు చక్రాల మోటార్ సైకిల్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**కాకినాడ:** స్థానిక హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు స్నేహ పరిమళాలు చాటారు. కష్టాల్లో ఉన్న బాల్య మిత్రునికి తమకు తోచిన సాయం చేసేందుకు వారంతా ఒక్కటయ్యారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారంతా సోమవారం కాకినాడలోని బాల్య మిత్రుడు, సినీ నిర్మాత పీడీఆర్ ప్రసాద్‌రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. గతేడాది జరిగిన ఆత్మీయ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సమీకరించిన సుమారు రూ.1.25 లక్షలతో కొనుగోలు చేసిన మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను దివ్యాంగుడైన బాల్యమిత్రుడు జీర వెంకట రమణకు అందజేశారు. అనంతరం ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో గడిపిన మధుర జ్ఞాపకాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. తమ వయసు, హోదాలను పక్కన పెట్టి ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న బాల్య మిత్రునికి చేయూత ఇవ్వాలని నిర్ణయం తీసుకోగానే.. క్షణం కూడా ఆలోచించకుండా ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ముందుకొచ్చిన మిత్రులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మిత్రుల ఔదార్యానికి జీవితాంతం రుణపడి ఉంటానని వెంకటరమణ అన్నారు. ఇంటింటికీ తిరుగుతూ వాము అరుకు అమ్ముకుంటూ జీవనం సాగించే తనకు ఈ మూడు చక్రాల మోటార్ సైకిల్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇదే రీతిలో కష్టాల్లో ఉన్న బాల్య మిత్రులను గుర్తించి 1990వ పూర్వ విద్యార్థుల సంఘం తరఫున ఆర్థిక చేయూత ఇవ్వాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు.

### గొప్ప నటి అంజలీదేవి

**పెద్దాపురం:** తన నటనా కౌశలంతో యావత్ ప్రజానీకాన్ని మెప్పించిన నటి అంజలీదేవి అని పలువురు వక్తలు అన్నారు. పెద్దాపురం పట్టణ ఆడపడుచు అంజలీదేవి తొమ్మిదో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఫౌండేషన్ కన్వీనర్ పాలమరశెట్టి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్ గోళ్ల విజయలక్ష్మి మాట్లాడుతూ నటనలో, వ్యక్తిగత జీవితంలో అందరికీ ఆదర్శంగా నిలిచి గొప్ప నటి అంజలీదేవి అన్నారు. ఆమెను కళాకారులు ఆదర్శం తీసుకోవాలని పిలుపునిచ్చారు. నటి అంజలీదేవి పెద్దాపురంలో జన్మించడం పట్టణ ప్రజలకు గర్వకారణమన్నారు. అంజలీదేవి మేనల్లుడు గోళ్ల బాబి, గోళ్ల శ్రీను తదితరులు మాట్లాడుతూ అభిమానుల గుండెల్లో చెరగని ముద్రగా ఆమె నిలిచిపోతారన్నారు. తొలుత అంజలీదేవి విగ్రహానికి వారు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రంధి సత్యనారాయణ, ఒబిలిశెట్టి గణేష్, అంజలీదేవి కుటుంబ సభ్యులు, అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.